# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి: 12 | సంచిక: 170 | బుధవారం | 21-01-2026 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com


బాబీ దర్శకత్వంలో
## చిరు తదుపరి సినిమా



08


CVR Chits Pvt. Ltd.
సి.వి.ఆర్. చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్
Financial Solutions for Your Needs


వాహనాల తాళాలు లాక్కోవద్దు..
# సీజ్ చేయవద్దు





- ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలు
- పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దు

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:** వాహన చలాన్లపై ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై సామాజిక కార్యకర్త, న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీసులు వాహనాలను అడ్డగించి బలవంతంగా నగదు వసూలు చేయడం వల్ల సామాన్య ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విజయ్ గోపాల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనదారులు తమ

మిగతా 2వ పేజీలో..

# హరీష్ రావు పై ప్రశ్నల వర్షం



- ఫోన్ ట్యాపింగ్ కేసు లో సుదీర్ఘ విచారణ
- ప్రభుత్వంపై హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీష్ రావును సిట్ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు ఏడున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో అధికారులు హరీష్ రావుపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పటికే అరెస్టయిన మాజీ పోలీసు అధికారులు ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు ,ఇటీవల విచారణ ఎదుర్కొన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు ఓ టీవీ చానల్ ఎండీ ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా హరీష్ రావును ప్రశ్నించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఇంటెలిజెన్స్ అధికారులతో మీకు ఉన్న సంబంధం ఏమిటి? ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని

మిగతా 2వ పేజీలో..

సింగరేణి టెండర్ల పై
## సిబిఐ విచారణ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు డిమాండ్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ల కు సమాన పాత్ర
- సీఎం, డిప్యూటీ సీఎం మధ్య వివాదాలు



02



అరబ్ దేశాల ప్రతినిధులతో
## రేవంత్ రెడ్డి భేటీ

దావోస్‌లో బిజీ బిజీగా గడిపిన సిఎం, మంత్రులు

ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సహకరిస్తాం

**జర్నలిస్ట్ డైరీ,ఇంటర్నెట్ డెస్క్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్‌లో బిజీ బిజీగా గడిపారు. అరబ్ దేశాల ప్రతినిధులతో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తెలంగాణతో కలిసి పనిచేస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్

మిగతా 2వ పేజీలో..

# మేడారం జాతరకు నాలుగు వేల బస్సులు

రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా

మహిళలకు ఉచిత ప్రయాణం



**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:** మేడారం జాతరకు రాష్ట్రంలోని 51 సెంటర్ల నుంచి 4వేల బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మేడారానికి వెళ్లే మహిళలకు సైతం ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా శాఖ

మిగతా 2వ పేజీలో..



02

### ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

- తెలంగాణ సీఐడీ కీలక నిర్ణయం
- మహిళలు, చిన్నారుల కేసుల్లో తక్షణ చర్యలు



02

### బిజెపి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్


అంతా సొల్లు
# పురాణమే...


మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కేటీఆర్ సహ ముఖ్యనేతలతో భేటీ

అక్రమ అరెస్టుకు కుట్ర

02



# సింగరేణి టెండర్ల పై సిబిఐ విచారణ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు డిమాండ్
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల కు సమాన పాత్ర
- సీఎం, డిప్యూటీ సీఎం మధ్య వివాదాలు

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**



సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల కు సమాన పాత్ర ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఆరోపించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సింగరేణిలోని నైని బ్లాక్ వివాదంపై సీబీఐ లేదంటే ఏదైనా సంస్థతో దర్యాప్తు జరపాలి. ఇది ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య జరిగిన గొడవల వలనే బయటకు వచ్చింది. మీడియాలో వచ్చిన తర్వాతే నైని బ్లాక్ టెండర్లు రద్దు చేశారు. అంతకు ముందు టెండర్లు ఎందుకు రద్దు చేయలేదో భట్టి బయట పెట్టాలి' అని ఆయన అన్నారు. రామచంద్రరావు మాట్లాడుతూ.. 'నైని బ్లాక్ వ్యవహారంలో పారదర్శకత లేదు. సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్ పాత్ర ఉంది. రాష్ట్రమంతా నైని కోల్ బ్లాక్ గురించి మాట్లాడుతున్నారు. సింగరేణిలో ఎప్పుడూ కూడా రాష్ట్ర ప్రభుత్వం వాటా అధికంగా ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి లాభాల్లో ఉంది. నైని కోల్ బ్లాక్ అంశంతో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య వివాదాలు బయటపడ్డాయి. మంత్రులు బంధువుల కు కోల్ బ్లాక్ కేటాయించే ప్రయత్నం చేశారు. కిషన్ రెడ్డికి లేఖ రాసే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదు. బీఆర్ఎస్ సుద్ద పూసేమీ కాదు. నైని బ్లాక్‌లో ఎవరికి ఎంత ముట్టిందో చెప్పాలి. సింగరేణిలో కమిషన్ కింద కోట్లు సంపాదిస్తున్నారు' అని రామచంద్రరావు తెలిపారు. కాంగ్రెస్ మంత్రుల మధ్య తగాదాలు అవుతున్నాయి. వారి వారి బంధువులకు కాంట్రాక్టులకు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఆస్తుల పంచాయతీ నడుస్తోంది. హరీష్ రావుకు ఒకటే చెప్తున్నా.. సుద్దపూస మాటలు మాట్లాడొద్దు. రాష్టానికి మొదట భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్.. దాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది. సింగరేణి ఉద్యోగులకు, ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. స్టేట్ గవర్నమెంట్‌లో సిట్, ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఉన్నాయి. వాటితో కూడా విచారణ జరిపించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల అవినీతి, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై కూడా అవినీతి విచారణ జరగాలి' అని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం మొత్తం రూ .లక్ష 30 వేల కోట్లు ఖర్చు చేశారు . కాళేశ్వరం ఎటిఎమ్ మారిందని మేము కూడా చెప్పాం. ఫోన్ ట్యాపింగ్ కేసు రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ కేసులో చాలా మంది అధికారులను అరెస్ట్ చేసినా.. రాజకీయ నాయకులను మాత్రం అరెస్ట్ చేయలేదు. ఇంకా ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ మాత్రమే చేస్తున్నారు. హరీష్ రావును సిట్ ఎందుకు పిలవలేదు. వారి ప్రభుత్వంలోనే ఫోన్ ట్యాపింగ్ చేశారు. సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వమని బీఆర్ఎస్ గతంలో జీవో తెచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ఆ జీవోను ఇంకా ఎత్తివేయలేదు. ఈడీకి ఎలాంటి అనుమతి అవసరం లేదు.. వాళ్ళు విచారణ చేయొచ్చు' అని రామచంద్రరావు పేర్కొన్నారు



## బిజెపి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్

**జర్నలిస్ట్ డైరీ,ఇంటర్నెట్ డెస్క్:**

భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. 'ముందుగా మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక సాధారణ కార్యకర్తనైన నన్ను పార్టీలోనే అత్యంత ఉన్నతమైన పదవికి చేరేలా చేశారు. నేను మీకు తలవంచి నమస్కరిస్తున్నాను' అని అన్నారు.

జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లులు కురిపించారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ నిరంతరంగా దేశం కోసం పాటుపడుతున్న తీరును సాధారణ కార్యకర్తలమైన తాము గమనిస్తూనే ఉన్నామన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అది నేను నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్న సమయం. అప్పుడు మీరు(ప్రధాని మోదీ) సభావన మిషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ప్రతీ ఒక్కరి కష్టాలను అడిగి తెలుసుకోవటం చూశాను. ఆ ప్రోగ్రామ్ తర్వాత మేము మీ గ్రీన్ రూములో మిమ్మల్ని కలిశాము. గుజరాత్ నుంచి చాలా మంది ఆ ప్రోగ్రామ్‌కు ఎందుకు వస్తున్నారో భావోద్వేగపూరితంగా మీరు మాకు వివరించారు. ప్రజల ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యే వారే గొప్ప నాయకులు అవుతారని నాకు అప్పుడు అర్థమయింది' అని చెప్పారు.

# అరబ్ దేశాల ప్రతినిధులతో రేవంత్ రెడ్డి భేటీ

**మొదటిపేజీ తరువాయి**

సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ.. తెలంగాణ లక్ష్యమని వ్యాఖ్యానించారు. యూఏఈ- తెలంగాణ సంయుక్త టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదన చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజు బిజీబిజీగా ఉంది. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ చైర్మన్ అలోన్ స్టోపెల్‌తో సీఎం భేటీ అయ్యారు. సీఎంతో పాటూ మంత్రులు శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్‌తో పాటు హెల్త్ టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది. తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలని గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా పదిశాతం లక్ష్యంగా విజన్ రోడ్‌మ్యాప్‌లో ఉందని తెలిపారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం- 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు-2026లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరానికి చేరుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రతినిధి బృందానికి జ్యూరిచ్ విమానాశ్రయంలో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్ గారు, ఇతర అధికారులు జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి కి ఆత్మీయ స్వాగతం పలికి, మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి గారి వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.






## ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

- తెలంగాణ సీఐడీ కీలక నిర్ణయం
- మహిళలు, చిన్నారుల కేసుల్లో తక్షణ చర్యలు

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**

దేశంలోనే తొలిసారి పౌర ప్రత్యేక కేసుల్లో బాధితుల ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేసే ప్రక్రియను తెలంగాణ సీఐడీ ప్రారంభించింది. దేశంలోనే తొలిసారి పౌర కేంద్రిత పోలీసింగ్‌కు సీఐడీ శ్రీకారం చుట్టింది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా మహిళలు, చిన్నారుల కేసుల్లో తక్షణ చర్యలు ఉంటాయి. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, శారీరక దాడులు, ఆస్తి వివాదాల్లో తీవ్ర మానసిక ఒత్తిడి ఉన్న కేసులు, పోక్సో చట్టం కింద కేసులు, ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాలు, ర్యాగింగ్ వంటి కేసుల్లో ఫోన్ చేస్తే చాలు పోలీసులు ఇంటికే వస్తారు.

బాధితుల నివాసం, ఘటనా స్థలం, ఆసుపత్రి వంటి వివిధ ప్రాంతాల్లో పోలీసులు అక్కడికక్కడే ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఈ కొత్త విధానంలో ఇంటి వద్దే బాధితుల నుండి ఫిర్యాదులు తీసుకోవడం జరుగుతుంది. ఆ తర్వాత వెంటనే సంబంధిత స్టేషన్‌కు పంపి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. ఎఫ్ఐఆర్ ప్రతిని ఇంటి వద్దే బాధితులకు అందిస్తారు.స్టేట్‌మెంట్ రికార్డింగ్, సాక్ష్యాల సేకరణ వంటి ప్రక్రియలు అక్కడికక్కడే చేయనున్నారు. పౌర కేంద్రిత పోలిసింగ్ విధానాన్ని అన్ని పోలీస్ యూనిట్లు తప్పనిసరిగా అమలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు విడుదలయ్యాయి.






## హరీష్ రావు పై ప్రశ్నల వర్షం

**మొదటిపేజీ తరువాయి**


ఎన్నికల సమయంలో లేదా ఇతర రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారా? అన్న కోణంలో ప్రధానంగా ప్రశ్నలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా సిద్దిపేట ప్రాంతానికి చెందిన రియల్టర్ చక్రధర్ గౌడ్ ఫిర్యాదు , ఆ సమయంలో జరిగిన కాల్ డేటా సేకరణపై హరీష్ రావును అధికారులు వివరణ కోరినట్లు తెలుస్తోంది. సిట్ ప్రశ్నలకు హరీష్ రావు తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పదేళ్లలో మేము చట్టానికి లోబడే పనిచేశాం, ఏ అధికారికి కూడా ఇలాంటి చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఇవ్వలేదు అని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఇతర నిందితుల వాంగ్మూలాలను ఉటంకించినప్పుడు.. వారిపై ఒత్తిడి తెచ్చి లేదా ప్రలోభపెట్టి అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి ఉండవచ్చు అని ఆయన కొట్టిపారేసినట్లు చెబుతున్నారు. విచారణకు వెళ్లే ముందు ప్రభుత్వంపై హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కేవలం రేవంత్ రెడ్డి బావమరిది బొగ్గు కుంభకోణాన్ని తాను బయటపెట్టినందుకే ఈ నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. చట్టంపై తమకు నమ్మకం ఉందని, ఎన్నిసార్లు పిలిచినా విచారణకు సహకరిస్తామని చెప్పారు. అయితే, హరీష్ రావు ఇచ్చిన సమాధానాలపై సిట్ అధికారులు సంతృప్తి చెందారా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఆయన సమాధానాలను ఇప్పటికే సేకరించిన సాంకేతిక ఆధారాలతో సరిపోల్చిన తర్వాత, సిట్ మరోసారి ఆయనను విచారణకు పిలిచే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

# అంతా సొల్లు పురాణమే...

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కేటీఆర్ సహా ముఖ్యనేతలతో భేటీ
- అక్రమ అరెస్టుకు కుట్ర

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సిట్ అధికారుల విచారణ ముగిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును ఏడున్నర గంటల పాటు ప్రశ్నించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న ఆయన.. కేటీఆర్ సహా ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దగ్గర ఒక్క ఆధారమూ లేదని తెలిపారు. అన్నీ నిరాధారమైన ఆరోపణలు.. సొల్లు పురాణమేనని ఎద్దేవా చేశారు. ఈ కేసులో అడిగిన ప్రశ్నలే అడిగారు తప్ప.. మరేమీ లేదని స్పష్టం చేశారు. సిట్ గంట సేపు ప్రశ్నించడం.. మరో గంట సేపు ఫోన్ వచ్చిందని బయటికెళ్లడమే జరిగిందని తెలిపారు. అటెన్షన్ డైవర్షన్ కోసమే విచారణకు పిలిచారని విమర్శించారు.



టెండర్ల అవినీతిని బయటపెట్టినందుకే విచారణకు పిలిచారని హరీశ్‌రావు పేర్కొన్నారు. బొగ్గు అవినీతిలో మొదటి లబ్ధిదారుడు రేవంత్ బామ్మర్దేనని ఆరోపించారు. రేవంత్ బామ్మర్ది రూ.వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారని విమర్శించారు. సైట్ విజిట్ పేరుతో జరిగిన కుంభకోణాన్ని బయటపెట్టామని వెల్లడించారు. దమ్ముంటే కమిషన్‌తో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తనను అక్రమ కేసులో ఇరికించాలని చూస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే.. తనను అక్రమ అరెస్టు చేసేందుకు కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. తనను ఘోష్ కమిషన్ విచారణకు పిలిపించారని తెలిపారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంటూ మరో విచారణకు పిలిచారని తెలిపారు. అయినా రేవంత్‌రెడ్డిని వదలబోనని.. ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటానని హెచ్చరించారు.



## మేడారం జాతరకు నాలుగు వేల బస్సులు

**మొదటిపేజీ తరువాయి**

నుంచి 10, 441 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీనాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.

మేడారం విధుల్లో 7వేల మంది డ్రైవర్లు 18 మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

ఆర్టీసీ బస్సుల్లో 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50ఎకరాల్లో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్‌స్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. బస్టాండ్‌స్‌లో క్లోజ్డ్ సర్క్యూట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

28వ తేదీ నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతామని చెప్పుకొచ్చారు. మేడారం వెళ్లేటప్పుడు బస్సులు నిండుతాయని... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని తెలిపారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి... రెగ్యులర్ ఛార్జీల కంటే 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు.

# వాహనాల తాళాలు లాక్కోవద్దు.. సీజ్ చేయ వద్దు

**మొదటిపేజీ తరువాయి**

వాహనాల తాళాలను పోలీసులు లాక్కోవడం వల్ల మానసిక వేదనకు గురవుతున్నారని ఆయన వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు, పోలీసు యంత్రాంగం తమ పరిమితులను అతిక్రమించకూడదని సూచించింది. చలాన్ల చెల్లింపు విషయంలో హైకోర్టు ఒక స్పష్టమైన విధానాన్ని వెల్లడించింది. ఏదైనా కారణంతో వాహనాన్ని ఆపినప్పుడు, వాహనదారుడు తనంతట తానుగా పెండింగ్ చలాన్లను క్లియర్ చేయడానికి ముందుకు వస్తేనే పోలీసులు ఆ మొత్తాన్ని వసూలు చేసుకోవచ్చని తెలిపింది. ఒకవేళ వాహనదారులు ఆ సమయంలో చెల్లించడానికి ఇష్టపడకపోతే, వారిని నిర్బంధించే అధికారం పోలీసులకు లేదని స్పష్టం చేసింది. పెండింగ్ బకాయిల కోసం చట్టపరమైన పద్ధతిలో కోర్టు నోటీసులు పంపాలే తప్ప, రోడ్ల మీద దౌర్జన్యంగా వ్యవహరించకూడదని ఆదేశించింది.కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈచలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది.

కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్‌అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. హైకోర్టు ఇచ్చిన




ఈ తాజా ఆదేశాలతో లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ముఖ్యంగా నగరాల్లో ట్రాఫిక్ పోలీసులు చలాన్ల కోసం వేటాడుతున్నారన్న విమర్శలకు ఈ తీర్పు అడ్డుకట్ట వేయనుంది. నిబంధనల పేరుతో సామాన్యులను వేధిస్తే సహించబోమని న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతోంది.

# సంగెంలో ఉచిత పశు చికిత్సా శిబిరం

**జర్నలిస్ట్ డైరీ,షాద్ నగర్:**



రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కేశంపేట మండలం సంగెం గ్రామంలో పశువులకు ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ఈ శిబిరం ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది. పశువుల్లో ఎక్కువగా కనిపిస్తున్న గర్భకోశ సంబంధిత వ్యాధులను గుర్తించి, తొలిదశలోనే చికిత్స అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాల చారి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల ఆర్థికాభివృద్ధికి పశుసంపద కీలక పాత్ర పోషిస్తుందని, పాడి పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటే పాల దిగుబడి పెరిగి రైతు కుటుంబాల జీవన స్థాయి మెరుగుపడుతుందని అన్నారు. గ్రామాల్లో ఇలాంటి ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా రైతులకు వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అనంతరం పాడి రైతులకు అవసరమైన టీకాలు, మందులను స్వయంగా అందజేశారు.

ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన పశువైద్యులు పాల్గొని పశువులకు గర్భకోశ వ్యాధులు, జ్వరాలు, చర్మ వ్యాధులు, ఇతర సాధారణ రోగాలపై సమగ్రంగా పరీక్షలు నిర్వహించారు. వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే పశువుల ఆరోగ్యంతో పాటు రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వైద్యులు రైతులకు వివరించారు. పశువులకు సరైన పోషకాహారం అందించడం, శుభ్రమైన వాతావరణంలో ఉంచడం, సమయానికి టీకాలు వేయించుకోవడం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ షకీల్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి పశుపోషక రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో పశుసంరక్షణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి గ్రామ పాలకవర్గం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

శిబిరంలో గ్రామ వార్డు సభ్యులు, మహిళా రైతులు, పశుపోషకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పశువులకు ఉచితంగా చికిత్సలు చేయించుకున్నారు. ఈ శిబిరం వల్ల పశువుల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు పాల ఉత్పత్తి పెరిగే అవకాశముందని రైతులు తెలిపారు. ఉచితంగా మందులు, టీకాలు అందించడం వల్ల తమకు వేల రూపాయల వరకు ఖర్చు ఆదా అయిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంఘానికి, గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాల చారి, ఉపసర్పంచ్ మహమ్మద్ షకీల్, గ్రామ పాలకవర్గానికి రైతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ రైతుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని వారు కోరారు.

# కమ్యూనిటీ హాల్ కోసం విజ్ఞప్తి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

శేరిలింగంపల్లి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీని కలిసి వినతి పత్రం సమర్పించారు .

కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఎమ్మెల్యే ను కలిశారు.

ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం సంఘం సభ్యులు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోరుకు కృషి చేయాలని గాంధీకి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ...

కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తానని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, కమ్యూనిటీ హాల్ ను అందరికి ఆమోదయోగ్యమైన విధంగా నిర్మించి, త్వరలోనే అందుబాటులో కి తీసుకువస్తామని తెలియచేసారు. కమ్యూనిటీ హాల్ లో చిన్న చిన్న సమావేశాలు, సభలు, బర్త్ డే వేడుకలు నిర్వహించుకోవడానికి చాలా ఉపయోగపడుతుంది అని తెలియచేసారు. శేరిలింగంపల్లి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం సంఘం అభివృద్ధి కి కృషి చేస్తానని తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కరుణాకర్ గౌడ్, రామరాజు, శేరిలింగంపల్లి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం సంఘం సభ్యులు సాయిలు ప్రెసిడెంట్, రవీందర్ జనరల్ సెక్రెటరీ, పరుశురాం వైస్ ప్రెసిడెంట్ , శేఖర్ ట్రెజరర్, మానిక్ ప్రభు వైస్ చైర్మన్, భాస్కర్ గౌరవ అధ్యక్షులు, సాయి కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ , సభ్యులు విజయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:-**

కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలకు వ్యాపారులకు ఇబ్బందులను గుర్తించిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం మార్కెట్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మార్కెట్ ప్రాంతంలో పూర్తిస్థాయి పైకప్పు (డోమ్) నిర్మాణం, రంగులు వేయడం, సివిల్ వర్క్, అలాగే మార్కెట్ వెనుక భాగంలో సీసీ రోడ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనుల కోసం మొత్తం రూ.55 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించబడినట్లు కార్పొరేటర్ తెలిపారు.

ఈ అభివృద్ధి పనుల వల్ల వ్యాపారులు, కొనుగోలుదారులు మరింత సౌకర్యంగా మార్కెట్‌ను ఉపయోగించుకోగలుగుతారని, పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని కార్పొరేటర్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకే ప్రాధాన్యతనిస్తూ చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని బొంతు శ్రీదేవి యాదవ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కుషాయిగూడ కూరగాయల మార్కెట్ ప్రెసిడెంట్ వాకాటి శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, రమేష్ ఐత, బెల్లం కృష్ణ, రాజా రెడ్డి, రవి నాయక్, మహేష్, సుధాకర్, రవీందర్, రాములు నాయక్, కరుణాకర్, కాంగ్రెస్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, ప్రకాష్ రెడ్డి, చిందం బాలనరసింహ, హీరా లాల్ నాయక్, ముత్యాలు, వెంకట్ రెడ్డి, నజీర్, సత్తమ్మ, నవనీత, మున్నీ, నిర్మల, సంధ్య, గిరిజ, వర లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు



# పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగించాలి

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:-**

నాచారంలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువులో విపరీతంగా గుర్రపు డెక్క పెరిగిన విషయం గతంలో అనేకసార్లు జోనల్ కమిషనర్ తీసుకుని వెళ్ళడం జరిగిందని, సమస్యను తక్షణమే పరిష్కరించాలని కార్పోరేటర్ శాంతి ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధికాగుప్తకు వినతిపత్రం అమె కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతానికి సంబంధించిన మరికొన్ని అంశాలను ఉప్పల్ జోనల్ కమిషనర్ కు వివరించారు. కాప్రా సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు గుర్రపు డెక్క తొలగింపు పనులు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించారని వారిపై తక్షణమే విచారణ జరపాలని కోరడం జరిగిందని, మిగిలిన గుర్రపు డెక్క తక్షణమే తొలగింపు పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అలాగే గత సంవత్సరం మెయింటెనెన్స్ కాంట్రాక్టు పూర్తయిన సందర్భంగా కొత్త కాంట్రాక్టర్ ను ఏర్పాటు చేయాలని కార్పోరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జోనల్ కమిషనర్ ని కోరడం జరిగింది. కాగా సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ తొందరలోనే గుర్రపు డెక్క తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పోరేటర్ తెలిపారు.

# ఈస్ట్ గాంధీనగర్ ఎన్నికల్లో గౌరక్క సత్యం సాగర్ ప్యానల్ విజయం

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:-**

నాగారం మునిసిపల్ డివిజన్ పరిధలో ఈస్ట్ గాంధీనగర్ కాలనీ అసోసియేషన్ కు జరిగిన ఎన్నికలలో గౌరక్క సత్యం సాగర్ ప్యానల్ వియం సాధించింది. ప్యానల్ పూర్తిగా ఎన్నికైన ఈ ఎన్నికలలో అధ్యక్షుడు గా పోటీ చేసిన గౌరక్క సత్యం సాగర్ కు 359 ఓట్లు రాగా తన ప్రత్యర్థి పోతంశెట్టి రేఖకు 139 ఓట్లు వచ్చాయి, సత్యం రేఖపై 256 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. అలాగే సత్యం సాగర్ ప్యానల్ 12 మంది అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి మర్రి సాయిప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా నక్క నవీన్ సాగర్, అలాగే ఇద్దరు ఉపాధ్యక్షులు, ఇద్దరు కార్యదర్శులు, ఐదుగురు కార్యవర్గ సభ్యులు మొత్తం ప్యానల్ భారీ మెజారిటీతో గెలిచింది. కాగా ఈ గెలుపు మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి సహకారం తో మా ప్యానల్ అత్యధిక మెజారిటీతో గెలవడం జరిగిందని నూతనంగా అధ్యక్షుడు గా ఎన్నికైన గౌరక్క సత్యం సాగర్ ఈ సందర్భంగా తెలిపారు. కాలనీ వాసులు తమపై విశ్వాసంతో భారీ మెజారిటీతో గెలిపించారని, వారికి కృతజ్ఞత పూర్వకంగా కాలనీలో సమస్యలు పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గెలిచిన తమ కమిటి ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని సాగర్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా నూతన కమిటీని మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి, కాలనీ ప్రముఖులు అభినందించారు.



# షాద్ నగర్ లో బస్తీ దవాఖాన

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

షాద్ నగర్ పట్టణంలోని కాలనీలోని 20వ వార్డు (పాత గంజి) లో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి లలితాదేవి తో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ విజయలక్ష్మి,హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డిపిఓ అక్రమ్, సీసీ సురేష్,డాక్టర్ స్రవంతి చించోడు,డాక్టర్ దామోదర్, ఏఎన్ఎం,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు దవాఖానాలకు దీటుగా తీర్చిదిద్ది అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని సర్కారు దవాఖానాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించి పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. మా ప్రభుత్వ ముఖ్యంగా వైద్యం,విద్య ఈ రెండిటికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని అప్పుల పాలు అవుతున్నారని అందుకే పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో బస్తీ దవఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఈ దవఖానాల్లో ప్రతి రోగానికి రక్త పరీక్షలతో పాటు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందని ఇక్కడున్న సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అతి త్వరలో షాద్నగర్ పట్టణంలో ఏర్పాటు కాబోయే 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.

ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి లలిత దేవి మాట్లాడుతూ...ఈ బస్తీ దవఖన సెంటర్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ఇందులో స్టాఫ్ నర్సులతో పాటు, అదనపు సిబ్బంది ఒక మెడికల్ ఆఫీసర్,అందుబాటులో ఉంటారని అందరికీ ఓపీ అన్ని రకాల టెస్టులను తెలంగాణ డయాగ్నెటిక్స్ హబ్ కి పంపించడం జరుగుతుందని ఇందులో 134 పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ వాహనం వచ్చి శాంపిల్స్ కలెక్ట్ చేసుకుని తెలంగాణ డయాగ్నోసిస్ సెంటర్ కు ఇవ్వడం జరుగుతుందని 24 గంటల్లో పేషంట్స్ వాట్సప్ కి రిపోర్ట్స్ యొక్క రిజల్ట్స్ సమాచార రూపం అందివ్వడం జరుగుతుందని.అలాగే ప్రతి సోమవారం గర్భిణుల కు ప్రత్యేక పరీక్షలు నిర్వహి ఇస్తామని

అలాగే ప్రతి మంగళవారం 15 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల మహిళల వరకు అన్ని రకాల వైద్య సేవలు వీరికి అందించబడతాయని అలాగే బుధవారం శనివారం ఇమినేషన్ అనే ప్రత్యేక ప్రోగ్రాం ఉంటుందని.గురువారం పెద్దవారికి ఓపి క్లీనింగ్ తో పాటు ప్రతివారం ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమం తో పాటు బీపీ మరియు షుగర్ ఉన్నవారికి ప్రతి నెల నెల మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

అలాగే శుక్రవారం ప్రతి గర్భిణీ స్త్రీ కి పరీక్షలు నిర్వహిస్తామని

అన్నారు. శనివారం ఒక్కరోజే సెలవు దినంగా ప్రకటించడం జరిగింది. అయితే ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంకల చెన్నయ్య ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, షాద్నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ఫరూక్నగర్ మండల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగనూరి బస్వం,ముబారక్ అలీ, ఖాదర్ మొదలగువారు పాల్గొన్నారు.





# కూకట్‌పల్లిలో భర్తను చంపిన భార్య

**జర్నలిస్ట్ డైరీ హైదరాబాద్:**

కూకట్‌పల్లిలోని ఈనాడు అసలు గుట్టు వీడింది. భర్తను చంపిన భార్యను పోలీసులు కాలనీలో కట్టుకున్న భర్తను అతి కిరాతకంగా చంపేసింది ఓ భార్య. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. కానీ, పోలీసుల విచారణలో అసలు గుట్టు వీడింది. భర్తను చంపిన భార్యను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

సుధీర్ రెడ్డి (44), ప్రసన్న భార్యాభర్తలు. కూకట్‌పల్లిలోని ఈనాడు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఓసారి సుధీర్ రెడ్డిని చంపేందుకు ప్రసన్న ప్రయత్నించింది. ఆ పన్నాగాన్ని పసిగట్టిన సుధీర్ రెడ్డి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య తనను చంపేందుకు ప్రయత్నిస్తోందంటూ కంప్లైంట్ ఇచ్చాడు. ఆ తరువాత అంతా సద్దుమణిగిందని భావించగా.. సరిగ్గా వారం తరువాత తన ప్లాన్‌ను అమలు చేసింది ప్రసన్న. గత నెల 24వ తేదీన సుధీర్ రెడ్డి మెడకు చున్నీ బిగించి చంపేసింది. ఆ తర్వాత తనకేమీ తెలియదన్నట్లు డ్రామాలాడింది. సుధీర్ రెడ్డి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా సుధీర్ రెడ్డిని హత్య చేసినట్లు గుర్తించిన

పోలీసులు.. మృతుడి భార్య ప్రసన్నను విచారించారు. ఈ విచారణలో తానే హత్య చేసినట్లు అంగీకరించింది. అక్రమ సంబంధానికి, జల్సాలకు అడ్డుగా ఉన్నాడనే కారణంగానే సుధీర్ రెడ్డిని చంపేసినట్లు చెప్పింది. ఆమెపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కి చెందిన శ్రీ వంశీ గారికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,50,000/ రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందచేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కి చెందిన వంశీ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 2,50,000/ మంజూరి అయినట్లు తెలియచేసారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీ కి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్ , చాంద్ పాషా, కావూరి అనిల్, స్వామి, సుదేశ్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఖానమేట్ స్కూల్ కు ప్రహరీ గోడ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించడానికి గాను నిధుల మంజూరి కొరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారికి పంపిన మంజూరి పత్రాలను ఆరెకపూడి గాంధీ అందచేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. పాఠశాల సిబ్బంది విజ్ఞప్తి మేరకు పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఆరు లక్షల రూపాయ లు మంజూరి చేయవలసిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించింది అని చెప్పారు.

నిధులు మంజూరు కాగానే పాఠశాల ప్రహరీ గోడ ను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పాఠశాలలో అన్ని రకాల మౌళిక వసతులు కల్పిస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం లో అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని ,మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ,ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని తెలియచేశారు. అన్ని రకాల మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలియచేశారు . మాదాపూర్ డివిజన్ మరియు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్, రాం చందర్,కావూరి అనిల్ , ప్రధానోపాధ్యాయురాలు సరిత ఉపాధ్యాయులు అంజి తదితరులు పాల్గొన్నారు.



# కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ పూజ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత , శ్రీ లలితా దేవి, శ్రీ వాసవి నగరేశ్వర స్వామి దేవాలయం లో తెలంగాణ వాసవి ఐక్యవేదిక. శేరిలింగంపల్లి ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలోశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ పూజ కార్యక్రమంలో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నరేందర్ బల్లా శేరిలింగంపల్లి ఆర్యవైశ్య ప్రముఖులు

పబ్బమల్లేష్ గుప్త, పోల సాయిబాబా గుప్త, గంప సత్యం గుప్త,పసుమర్తి శ్రీనివాస్ గుప్త ,దారం లక్ష్మయ్య గుప్త,. సంపత్ కుమార్ గుప్త, వనమా శ్రీనివాస్ గుప్త ,బాదం చిన్నం సత్యనారాయణ గుప్త సాయిబాబా గుప్త పబ్బా శ్రీనివాస్ గుప్త ,నటరాజ్ గుప్త పబ్బ భరత్ గుప్త భాస్కర్ గుప్త నాగరాజ్ గుప్త సోమ రమేష్ గుప్త శేషగిరి రావు గుప్త పబ్బా సాంబశివ మూర్తి పబ్బ జయ కృష్ణ గుప్త .మోహనరావు గుప్త లక్ష్మీనారాయణ గుప్త సీత గుండయ్య గుప్త రాముని లలిత గుప్త తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చమురు సంక్షోభంలో భారత్: అమెరికా ఆంక్షలతో విలవిల.



ప్రపంచ వ్యవహారాల్లో చమురు ఎంత ప్రముఖ స్థానం వహిస్తుందో, దానితో సాగే ధరల ఒడుదుడుకులు రాజకీయాలపై చూపే ప్రభావాన్ని చూస్తే స్పష్టమవుతుంది. బ్రూనై, కతార్, అజర్బైజాన్ వంటి చిన్న దేశాలు కూడా తమ భూగర్భంలో దాచి ఉంచిన ఈ నల్లసంపద వల్ల ప్రపంచంలో గుర్తింపును పొందాయి. కానీ ఈ సంపద వారికి నిజమైన స్థిరత్వాన్ని ,శాంతిని కల్పించిందా అనేది ఓ పెద్ద ప్రశ్నగా మిగిలింది. మరోకవైపు, భారతదేశం వంటి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు, చమురు అనేది అత్యవసర మైనది. కానీ ఎక్కువ శాతం దిగుమతి పైనే ఆధారం. ఈ ఇంధన కొరత మన ఆర్థిక విధాన రూపకర్తల ముందు నిరంతరం ఒక సవాలుగా నిలుస్తుంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో మూడవ అతిపెద్ద చమురు వినియోగదారు. ప్రతి రోజూ దాదాపుగా 50 లక్షల బ్యారెళ్లకు పైగా దిగుమతి అవసరం ఉంటుంది. ఇది మన మొత్తం వినియోగంలో 80 శాతం కంటే ఎక్కువ. మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ మరియు రవాణా వ్యవస్థ విస్తరణకు అనుగుణంగా ఈ డిమాండ్ మరింత పెరగనున్నది. ఈ పరిస్థితి మన ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. అంతర్జాతీయ చమురు ధరల హెచ్చుతగ్గులకు అనుగుణంగా... చాలా సున్నితంగా మన దేశం కూడా విధిగా నడుచుకోవాలి. ప్రతి డాలర్ ధర పెరుగుదల లేదా తగ్గుదల మన వాణిజ్య లోటు, రూపాయి విలువ మరియు ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావాన్ని చూపుతుంది.

2026 ప్రారంభంలో, అంతర్జాతీయ చమురు మార్కెట్ మార్పుల సంకేతాలు కనిపిస్తున్నాయి. వెనిజులాలలోని రాజకీయ మార్పు, ఇరాన్ మరియు రష్యాలపై పరిమితులు సడలడం వంటి అంశాలు చమురు సరఫరాను పెంచి, ధరలను ఒత్తిడికి లోను చేయగలవు. కొందరు విశ్లేషకులు బ్యారెలుకు 55 డాలర్ల స్థాయికి ధరలు క్రిందకు పడిపోతాయాని అంచనా వేస్తున్నారు. అలా నిజంగా జరిగితే భారతదేశానికి ఒక పెద్ద ఆర్థిక ఊరటగా ఉంటుంది. ప్రస్తుతం మన దేశం

ఒక బ్యారెలుకు, సుమారు 70 డాలర్లు చెల్లిస్తుంది. నిజంగా ఆయిల్ ధరలు కుప్పకూలినప్పుడు, ప్రతి బ్యారెలుకు కేవలం ఒక డాలర్ ధర తగ్గినా, రోజుకు 50 లక్షల బ్యారెళ్ల దిగుమతి భారం తగ్గుతుంది. సంవత్సరానికి లక్షల కోట్లు ఆదా అవుతాయి. ఈ పొదుపు స్థూల ఆర్థిక స్థిరత్వానికి, అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ద్రవ్యోల్బణ నియంత్రణకు దోహదపడుతుంది.

కానీ, ఈ హఠాత్తు అవకాశాన్ని మనం శాశ్వతమైన పరిష్కారంగా భావించకూడదు. చమురు మార్కెట్లు ఎప్పుడూ అస్థిరంగానే ఉంటాయి.అలాగే అంతర్జాతీయ రాజకీయ ఉధృతాలతో మార్పు చెందుతూ ఉంటాయి. ఇటీవలి చరిత్ర చూస్తే, 2014లో బ్యారెలుకు 140 డాలర్లు నుండి 2016లో 30 డాలర్లకు కిందకు పడిపోయాయి, మనం సంతోషం పడే లోపే మళ్లీ ఒక్కసారిగా 100 డాలర్ల పైకి ఎగసిపడిన అనుభవాలు మనకు ఉన్నాయి. అందువల్ల, తాత్కాలిక ధరల తగ్గుదలను స్వాగతించనా,మనకంటూ ఒక దీర్ఘకాలిక వ్యూహం అవసరం.మన ఆధారపాటును తగ్గించడంపై దృష్టి పెట్టాలి.

ఇక్కడే చమురు సంపద యొక్క విరుద్ధార్థం మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. మధ్యప్రాచ్యం, వెనిజులా లేదా రష్యా వంటి దేశాల చరిత్రలను చూస్తే, ఈ "నల్లబంగారం" తరచూ రాజకీయ అస్థిరత, విలాసవంతమైన వ్యయం మరియు అంతర్జాతీయ వివాదాలకు దారి తీసింది. సంపద నిర్వహణలో సృజనాత్మకత,సమగ్ర సూత్రదృష్టి లేకపోవడం ఈ దేశాలను "చమురు శాపానికి" గురి చేసింది. భారతదేశం చమురు సంపదలో దరిద్రంగా ఉండటం, ఒక విధంగా, ఈ రకమైన రాజకీయఆర్థిక చిక్కుల నుండి తప్పించుకున్నందుకు అదృష్టంగా కూడా భావించవచ్చు. ఇది మనల్ని వివేకం మరియు ఇనోవేషన్తో ఆర్థిక వ్యవస్థను నిర్మించే బాధ్యత వహించేలా చేసింది. అందువల్ల, భారతదేశం యొక్క ప్రాథమిక లక్ష్యం చమురు ధరలలో తాత్కాలిక హెచ్చుతగ్గుల నుండి లాభం పొందడం మాత్రమే కాక, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు వేగవంతమైన మార్పుకు ప్రాధాన్యత ఇవ్వడం కూడా అయి ఉండాలి. చైనా సౌర మరియు జలవిద్యుత్ శక్తి వైపు వేగంగా ముందుకు సాగడం గమనించదగ్గ అంశం. భారతదేశం సోలార్ మిషన్ వంటి చొరవలతో ఈ దిశలో పయనిస్తోంది, కానీ దీనికి మరింత వేగం మరియు వ్యూహాత్మక నిశ్చయం అవసరం ఉంది.

చివరిగా, 2026లో చమురు ధరలు తగ్గే అవకాశం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక అవసరమైన ఊపు నివ్వగలదు. ఈ పరిస్థితిని మనం ఒక వరంగా భావించి, మన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించుకోవాలి. అధిక దిగుమతి ఖర్చు వల్ల కలిగే ఆర్థిక భారాన్ని తగ్గించిన ఈ సమయంలో, సంచిత పొదుపును పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల పెట్టుబడి, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం మరియు శక్తి సామర్థ్యత పెంపుదల వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి. భవిష్యత్తు యొక్క స్థిరమైన మరియు స్వావలంబన ఆర్థిక వ్యవస్థను నిర్మించే దిశగా ఈ అవకాశాన్ని మార్చుకోవడంలోనే మన నిజమైన విజయం నిలుస్తుంది. చమురు శాపం నుండి బయటపడి, సౌరశక్తి వంటి నిర్మలమైన శక్తి వైపు మారడమే ఈ శతాబ్దపు అతిపెద్ద సవాలు మరియు అవకాశం కూడా.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

# ట్రంప్ గ్రీన్‌ల్యాండ్ సుంకాలు: నాటో దేశాల్లో ఆగ్రహం, వాణిజ్య ఒప్పందం స్తంభన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌ల్యాండ్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలన్న లక్ష్యంతో యూరప్ దేశాలపై కఠిన సుంకాలు విధించడం భారీ వివాదాన్ని రేపింది. ఈ ఏకపక్ష చర్య యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల ఆర్థిక హితాలకు తీవ్ర దెబ్బ తీస్తుందని ఈయూ నేతలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా, అమెరికాతో ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని ఈయూ పార్లమెంటు నిర్ణయించింది. ట్రంప్ సుంకాలు పడిన యూరప్ దేశాలు ఆదివారం ఉమ్మడి ప్రకటన జారీ చేసి, ఈ బెదిరింపులు తీవ్ర పరిణామాలకు కారణమవుతాయని హెచ్చరించాయి. గ్రీన్‌ల్యాండ్ విషయంలో తమ స్థానాన్ని మార్చబోమని, డెన్మార్క్‌కు పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేశాయి.



ట్రంప్ గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా భూభాగంగా మార్చాలన్న ప్రతిపాదనలను తిరస్కరిస్తున్న దేశాలపై ఈ సుంకాలు పడ్డాయి. డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, యూనైటెడ్ కింగ్‌డమ్, నార్వే, స్వీడన్, ఫిన్‌లాండ్, నెదర్లాండ్స్‌లాంటి దేశాల నుంచి దిగుమతులపై 10 శాతం అదనపు సుంకం విధించారు. జూన్ నుంచి దీన్ని 25 శాతానికి పెంచుతామని ట్రంప్ ప్రకటించారు. గ్రీన్‌ల్యాండ్ తమ చేతికి వచ్చేవరకు ఈ సుంకాలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఇది యూరప్ దేశాలను కలవరపరిచింది. గత సంవత్సరం జూలైలో అమెరికాతో ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం, యూరప్ నుంచి అమెరికా దిగుమతి చేసే వస్తువులపై 15 శాతం సుంకం ఉంటుంది. ఇక ఈయూ దేశాలు అమెరికా ఉత్పత్తులపై ఎలాంటి సుంకాలు విధించవు. అంటే, జీరో టారిఫ్ విధానం. ఈ ఒప్పందానికి ఈయూ పార్లమెంటు ఆమోదం అవసరం. వచ్చే వారంలో ఆమోదించాల్సి ఉంది, కానీ ప్రస్తుత సంక్షోభంతో దాన్ని స్తంభింపజేశామని స్వీడన్ ఎంపీ కరిన్ కార్‌ల్‌స్‌బ్రో వెల్లడించారు.

ప్రస్తుత సుంకాలతో ఫిబ్రవరి 1 నుంచి 25 శాతానికి, జూన్ తర్వాత 40 శాతానికి పెరగనున్నాయి. ఇది యూరప్ ఆర్థిక వ్యవస్థకు భారీ ఎదురుదెబ్బ. డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ రాస్ముస్సేన్ మాట్లాడుతూ, గ్రీన్‌ల్యాండ్‌కు సైనికులను పంపడం అమెరికాను రెచ్చగొట్టడానికి కాదని స్పష్టం చేశారు. రష్యా, చైనా ఆ ప్రాంతంపై ఆసక్తి చూపుతున్నాయన్న ట్రంప్ ఆందోళనలకు అనుగుణంగానే ఈ చర్య తీసుకున్నామని ఆయన అన్నారు. ఈ సుంకాలు యూరప్ హితాలకు హానికరమని యూరోపియన్ కౌన్సిల్ చీఫ్ ఆంటోనియో కోస్టా వ్యాఖ్యానించారు.

### తీవ్ర పరిణామాల హెచ్చరిక!

ట్రంప్ గ్రీన్‌ల్యాండ్‌పై తీసుకుంటున్న ఒత్తిడి, బెదిరింపులు ఊహించని సమస్యలకు దారితీస్తాయని యూకే, డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్ దేశాలు ఉమ్మడి ప్రకటనలో హెచ్చరించాయి. "డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ ప్రజలకు మద్దతిస్తాం. మా నిర్ణయంలో మార్పు లేదు. గత వారంలో జరిగిన సంఘటనలపై చర్చలకు సిద్ధం. నాటో సభ్యులుగా ట్రాన్స్ అట్లాంటిక్, ఆర్కిటిక్ భద్రతను పటిష్ఠం చేస్తాం" అని అందులో పేర్కొన్నారు. అయితే, సుంకాలు పడిన దేశాల్లో ఒకటైన జర్మనీ ఈ ప్రకటనకు దూరంగా ఉంది. అంతేకాకుండా, గ్రీన్‌ల్యాండ్‌కు పంపిన తమ 15 మంది సైనికులను తిరిగి రప్పించుకుంది.

### చైనా, రష్యాలకు సంతోషం!

నాటో మిత్ర దేశాల మధ్య ఏర్పడిన ఈ వివాదాన్ని చూసి చైనా, రష్యా రహస్యంగా సంబరాలు చేసుకుంటున్నాయని ఈయూ విదేశాంగ చీఫ్ కాజా కల్లాస్ 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశారు. నాటోలోని విభేదాలతో లాభపడేది ఆ రెండు దేశాలేనని ఆమె ఆరోపించారు. "గ్రీన్‌ల్యాండ్ భద్రతకు ముప్పు ఉంటే, నాటో అంతర్గతంగా చర్చించి పరిష్కరించుకోవాలి. ఈ సుంకాలు యూరప్‌కు, అమెరికాకు ఇరువురికీ నష్టమే" అని ఆమె సూచించారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేక రాయబారి కిరిల్ డిమిత్రివ్ ఈ విషయాన్ని హాస్యాస్పదంగా తీసుకున్నారు. 'మీ నాన్నను రెచ్చగొట్టకండి' అని ట్రంప్, ఈయూ నేతలను ఉద్దేశించి పోస్ట్ చేశారు. ఎనిమిది దేశాల నుంచి 1015 మంది సైనికులను గ్రీన్‌ల్యాండ్‌కు పంపడం, ట్రంప్ అందుకు సుంకాలు విధించడాన్ని ప్రస్తావిస్తూ, 'ఒక్కో సైనికుడికి ఒక శాతం సుంకం అన్నమాట' అని సెటైర్ వేశారు.

ఈ సంఘటనలు నాటో దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. గ్రీన్‌ల్యాండ్ వివాదం వాణిజ్య బంధాలను కుంగదీస్తుంది, ఆర్కిటిక్ ప్రాంత భద్రతపై ప్రభావం చూపవచ్చు.

*డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

## GLP-1ఇంజెక్షన్లతో అద్భుతాలు.. భారత్‌లో పెరుగుతున్న ఆకస్మిక "ప్రెగ్నెన్సీలు".. కారణాలు ఇవే..

- **GLP-1 వెయిట్ లాస్ ఇంజెక్షన్లతో అద్భుతాలు..**
- **మహిళల్లో పెరుగుతున్న ఆకస్మిక "ప్రెగ్నెన్సీలు"..**
- **చాలా ఏళ్లుగా గర్భధారణ లేని మహిళల్లో పాజిటివ్ ఫలితాలు..**
- **టైప్-2 డయాబెటిస్, ఊబకాయాన్ని తగ్గిస్తున్న మందులు..**
- **దీంతో మహిళల్లో మెటాబాలిజం మెరుగై గర్భధారణ..**

టైప్2 డయాబెటిస్ కోసం తీసుకువచ్చిన GLP1 వెయిట్ లాస్ ఇంజెక్షన్లు అద్భుతాలను సృష్టిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఈ మందుల వాడకం పెరిగింది. ముఖ్యంగా, షుగర్ వల్ల బాధపడుతున్న వారు మాత్రమే కాకుండా.. స్థూలకాయం, అధిక బరువుతో బాధపడుతున్న వారు వీటిని తీసుకుంటున్నారు. భారత్‌లో వీటి వాడకం వల్ల అనూహ్యంగా చాలా ఏళ్లుగా ఇన్‌ఫెర్టిలిటీతో బాధపడుతున్న చాలా మంది మహిళల్లో ఆకస్మిక "గర్భధారణ" కేసులు పెరుగుతున్నాయి. "ఆకస్మిక" లేదా "ఒజెంపిక్ శిశువుల"గా పిలిచే కేసుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు.

బరువును తగ్గించే మందులు భారత మార్కెట్‌లోకి ప్రవేశించిన కొన్ని రోజులకే, ప్రధాన నగరాల్లో గైనకాలజిస్టులు ఈ నిశ్శబ్దమైన, అనూహ్య ధోరణిని గుర్తించారు. గర్భం దాల్చే అవకాశాలు చాలా తక్కువగా లేదా అస్సలు లేవని నమ్మే మహిళల్లో ఊహించని విధంగా పాజిటివ్ ప్రెగ్నెన్సీ టెస్టులతో ఆస్పత్రులకు వస్తున్నారు.

కొన్ని నెలలుగా, భారత్‌లో మూడు GLP1 ఇంజెక్షన్లు మార్కెట్‌లోకి వచ్చాయి. ఎలి లిల్లీ సంస్థ తయారు చేసిన మౌంజారో(టిర్జెపాటైడ్), వెగోవి, ఒజెంపిక్ మార్కెట్‌లోకి వచ్చాయి. భారత్‌లో వీటి వాడకం చాలా పెరిగింది.

### ఎలా పనిచేస్తున్నాయి..?

వాస్తవానికి టైప్ 2 మధుమేహానికి చికిత్స చేయడానికి అభివృద్ధి చేయబడిన ఈ మందులు, ఆకలి, రక్తంలో చక్కెరను నియంత్రించే హార్మోన్లను నియంత్రిస్తాయి. ఆకలిని నియంత్రించడం వల్ల వేగంగా బరువు తగ్గించేలా చేయడంతో పాటు, బ్లడ్ షుగర్‌ను నియంత్రిస్తాయి. తద్వారా ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది.

వీటిని వాడుతున్న మహిళల్లో ఊబకాయం తగ్గి, బరువు తగ్గడంతో జీవక్రియ మెరుగవుతోంది. గణనీయమైన బరువు తగ్గడం వల్ల గర్భం దాల్చే అవకాశాలు ఒక్కసారిగా పెరుగుతున్నాయి. దీని వల్ల చాలా మందిలో ఏళ్లుగా ఆగిపోయిన ఒవ్యులేషన్ (అండ స్రావం) మళ్లీ మొదలవుతుంది. ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్ మరియు ఊబకాయం పరిశోధకుడు డాక్టర్ అనూప్ మిశ్రా, GLP 1 థెరపీని వాడుతున్నారని, ఇలాంటి కేసుల్ని తాను కూడా చూశానని అన్నారు.

"GLP1 మందులు సంతానోత్పత్తిని మెరుగుపరుస్తాయని మాకు తెలుసు కాబట్టి, రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి" అని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్నారు.








# ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు

**జర్నలిస్ట్ డైరీ,నాగోల్:**
రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తూ, మానసిక ఆందోళనలకు దూరంగా ఏకాగ్రతతో వాహనాలు నడిపినప్పుడే ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాన్ని చేరగలుగుతారని నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ అన్నారు.
ఈ నెల 1వ తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బండ్లగూడ టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ, నాగోల్ రవాణా శాఖ అధికారి అభిలాష్, వైద్యులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ, గతంలో ప్రజలు వివిధ వ్యాధుల వల్ల మృతి చెందేవారని, అయితే ప్రస్తుతం అత్యధికంగా రోడ్డు ప్రమాదాలే ప్రాణాలు తీసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్దలు, యువత, విద్యార్థులు మరణించడంతో ఎన్నో కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోతున్నాయని అన్నారు.
ప్రధానంగా వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. క్షణిక నిర్లక్ష్యం జీవితకాల విషాదంగా మారుతుందని హెచ్చరించారు.
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.
ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రమాదాలకు డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడటమే కారణమని వివరించారు. తమ కుటుంబాల్లోనూ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా పిల్లలు, బంధువులు, స్నేహితులకు రోడ్డు భద్రత నియమాలు తెలియజేసి అవగాహన కల్పించాలని సీఐ ప్రజలకు పిలుపునిచ్చారు.
బండ్లగూడ టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ, తమ సంస్థలో డ్రైవర్లు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా తరచూ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.





# కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల సమావేశం

**జర్నలిస్ట్ డైరీ, షాద్‌నగర్:**
మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శక్తి సమీకరణ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని వి కన్వెన్షన్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ముఖ్యనాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీలకు కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా నిలిచే పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యకర్తల త్యాగాలు, కష్టాలపైనే కాంగ్రెస్ పార్టీ బలంగా నిలబడిందని అన్నారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డులన్నింటిలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.శాసనసభ ఎన్నికల్లో ప్రజలను నమ్మించి, కష్టపడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను గెలిపించుకున్న తీరును గుర్తు చేశారు. అదే ఉత్సాహంతో, అదే సమర్పణతో మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా కలిసి, గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం ప్రతి నాయకుడు, కార్యకర్తల బాధ్యత అని అన్నారు. ప్రతి వార్డులో పోటీకి దిగే అభ్యర్థులను సమన్వయంతో ముందుకు నడిపిస్తూ, అంతర్గత భేదాభిప్రాయాలకు తావులేకుండా ఐక్యతతో పనిచేయాలని ఆయన సూచించారు. గెలుపే లక్ష్యంగా కాకుండా, ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు.
ఈ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మద్దతుతో కొనసాగుతున్నాయని అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ఈ అభివృద్ధే కాంగ్రెస్‌కు బలమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల స్థాయి నాయకులు, మున్సిపల్ ఆశావహులు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఎన్నికలను ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు.





# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**జర్నలిస్ట్ డైరీ, కరీంనగర్ కలెక్టరేట్:**
జనవరి 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు కవాతు మైదానంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్టేజీ, పార్కింగ్, విద్యుత్, అలంకరణ, సౌండ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, చిన్నారులు ఎక్కువ సంఖ్యలో వేడుకలకు హాజరయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. 108, 102, బాల రక్షక్, సఖి వాహనాలను ప్రదర్శనలో ఉంచాలన్నారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది పేర్లను పరిశీలించి నివేదికలు పంపాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ కవాతు మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పోలీస్ బందోబస్తు తో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# దర్గా రోడ్డుకు మరమ్మతులు

**జర్నలిస్ట్ డైరీ, షాద్‌నగర్:**
ప్రతి సంవత్సరం సంగెం గ్రామంలో ఘనంగా నిర్వహించే పీర్లగుట్ట గందోత్సవానికి వచ్చే వేలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలుగా హజ్రత్ గాలిబ్ షాహిద్ దర్గా రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాల చారి ప్రత్యేక చొరవతో మట్టి రోడ్డును సాఫీగా తయారు చేయించడంతో గ్రామంలో అభివృద్ధి వాతావరణం నెలకొంది.
వర్షాకాలంలో గుంతలు, దుమ్ము కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, గందోత్సవానికి ముందే రోడ్డు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ వేణుగోపాల చారి అధికారులను ఆదేశించారు. దీంతో పీర్లగుట్టకు వెళ్లే ప్రధాన మార్గం ఇప్పుడు భక్తులకు సౌకర్యవంతంగా మారింది.
ఈ రోడ్డుపనులు కేవలం గందోత్సవం కోసమే కాకుండా, రోజువారీ ప్రయాణాలకు కూడా ఎంతో ఉపయోగకరంగా మారాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ముఖ్యంగా మైనార్టీ సోదరులు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ వేణుగోపాల చారి గ్రామంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు.
భక్తుల విశ్వాసాలకు గౌరవం ఇవ్వడమే నిజమైన పాలన అని, గ్రామంలో సంప్రదాయాలు -అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నామని సర్పంచ్ వేణుగోపాల చారి ఈ సందర్భంగా తెలిపారు. గందోత్సవ సమయంలో శాంతి భద్రతలు, పరిశుభ్రతపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు.
పీర్లగుట్ట గందోత్సవానికి ముందు రోడ్డు మరమ్మతులు పూర్తవడంతో, ఈ ఏడాది వేడుకలు మరింత ఘనంగా, సాఫీగా నిర్వహించేందుకు మార్గం సుగమమైందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





# మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి నిధులు

**జర్నలిస్ట్ డైరీ,షాద్ నగర్ :**

కేశంపేట మండలంలోని మహిళా సంఘాలకు శాశ్వత గుర్తింపునిస్తూ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం గ్రామీణ మహిళల్లో కొత్త ఆశలు రేపుతోంది. ఇప్పటివరకు అద్దె భవనాలు, పాఠశాల గదులు, దేవాలయ ప్రాంగణాల్లో సమావేశాలు నిర్వహించిన మహిళా సంఘాలకు ఇకపై సొంత భవనాలు అందుబాటులోకి రానున్నాయి.
మండలంలోని మొత్తం 11 గ్రామపంచాయతీలకు ఒక్కో మహిళా సమాఖ్య భవనానికి రూ.1.10 కోట్ల చొప్పున నిధులు మంజూరు అయినట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నిధులు మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కీలకంగా మారనున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.
ఈ నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్కు మండల మహిళలు, కాంగ్రెస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలుపుతున్నాయని వీరేష్ పేర్కొన్నారు. మహిళా సమాఖ్య భవనాలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణకు కేంద్రాలుగా మారనున్నాయని ఆయన వివరించారు.
ప్రభుత్వం మహిళా సాధికారతను నినాదంగా కాకుండా కార్యరూపంలో అమలు చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల సంక్షేమం కోసం దీర్ఘకాలిక విధానాలతో ముందుకు వెళ్తున్నారని గూడ వీరేష్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని, గ్రామాభివృద్ధికి అదే పునాది అవుతుందన్నారు. ఈ భవనాల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, స్వయం నిర్ణయ శక్తి మరింత పెరుగుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





# నాగులపల్లి లో రైతు అవగాహనా సమావేశం

**జర్నలిస్ట్ డైరీ,షాద్ నగర్:**
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్క రైతులు ఉపయోగించుకోవాలని ఫరూక్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ సూచించారు మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి,గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వాల నుండి లభించే పథకాలపై అవగాహన కల్పించారు.ఇందులో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క రైతు తమ భూమి పట్టా పాసుబుక్,ఆధార్ కార్డు మరియు ఆధార్ కార్డుకు లింకైనా మొబైల్ నెంబర్ తో అందుబాటులో ఉన్న మీసేవా గాని లేదా సంబంధిత వ్యవసాయ అధికారి దగ్గర గాని సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.తద్వారా కేంద్ర,రాష్ట్రాల నుండి వచ్చే ప్రభుత్వ పథకాలు నేరుగా రైతులకు అందటానికి అవకాశం ఉంటుందన్నారు.అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు,పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వాలు,అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారని తెలిపారు.ఏదైనా సందేహాలు ఉంటే అందుబాటులో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ తో పాటు ఏఈవో తేజ్ కుమార్,రైతులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సలహాదారును కలిసిన కవ్వంపల్లి

**జర్నలిస్ట్ డైరీ, మానకొండూర్:**
టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం హైదరాబాద్ లో ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మ శ్రీరామ్ తదితరులు ఉన్నారు.



# కాంగ్రెస్ లో చేరిన చందా రాజు

**జర్నలిస్ట్ డైరీ, హుజురాబాద్:**
మున్సిపల్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ పెరుగుతుంది. ఓ వైపు అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ తోనే సాధ్యం అవుతుందని ప్రణవ్ అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో జమ్మికుంట పట్టణ 30 వార్డు నుండి వంద మంది వరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్. ఈ చేరికతో జమ్మికుంటలో కాంగ్రెస్ మరింత బలపడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందని, ఇంచార్జిగా ప్రణవ్ ప్రజల్లో మమేకమవుతూ పార్టీని ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారని ఈ సందర్భంగా వారి నాయకత్వంలో పని చేసేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరానని చందా రాజు అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.






## జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**జర్నలిస్ట్ డైరీ, కరీంనగర్:**
జనవరి 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ దినోత్సవం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని బూత్ స్థాయి పోలింగ్ అధికారులు నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లకు సన్మానం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామం, వార్డు స్థాయిలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. 25న కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓటు హక్కు, ఓటు ప్రాధాన్యత, ఆవశ్యకతపై తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన వంటి పోటీలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.



## కర్నెకోట నరేష్ కు సత్కారం

**జర్నలిస్ట్ డైరీ ,షాద్ నగర్:**
హైదరాబాదులో మంగళవారం ఘనంగా నిర్వహించిన ఆరెకటిక సన్మాన సభలో కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామ ఉప సర్పంచ్ కర్నెకోట నరేష్ ను రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రత్యేకంగా సన్మానించారు. గ్రామాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు, యువత సంక్షేమం కోసం నరేష్ చేసిన కృషిని గుర్తించి ఈ సత్కారం నిర్వహించినట్లు సభ నిర్వాహకులు తెలిపారు.
ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, గ్రామస్థాయి నాయకులే నిజమైన అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవ చేసే నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, యువతను క్రీడలు, సేవా కార్యక్రమాల వైపు నడిపిస్తున్న కర్నెకోట నరేష్ పాత్ర అభినందనీయమని అన్నారు.
ఈ సన్మాన సభకు ప్రముఖ సామాజికవేత్త, ప్రజా ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, గ్రామీణ ప్రజాస్వామ్య వ్యవస్థలో డిప్యూటీ సర్పంచ్ వంటి బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వారు నిజాయితీగా పని చేస్తే గ్రామాల ముఖచిత్రమే మారుతుందని అన్నారు. యువతను సంఘటితం చేస్తూ సేవా భావంతో ముందుకు నడిపిస్తున్న నరేష్‌ను అభినందించారు. సన్మానం పొందిన అనంతరం కర్నెకోట నరేష్ మాట్లాడుతూ, ఈ గౌరవం తనకు మాత్రమే కాకుండా కొండారెడ్డిపల్లి గ్రామ ప్రజలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని అన్నారు. గ్రామ అభివృద్ధి, యువత సంక్షేమం, పేదల సేవ కోసం మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డిపల్లి గ్రామ యువకులు, అభిమానులు, ఆరెకటిక సంఘ నాయకులు, వివిధ గ్రామాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ఇండియా లాంజ్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు.. 'నేషన్ ఫస్ట్'..

- **ప్రపంచ ఆర్థిక సదస్సులో ఇండియా లాంజ్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు..**
- **కేంద్ర మంత్రులు, వివిధ సీఎంలు, మంత్రులు, పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి ప్రసంగం..**
- **నేషన్ ఫస్ట్ అనే స్ఫూర్తి చాటేలా టీమ్ ఇండియాగా అంతా కలసి పనిచేద్దామని పిలుపు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**
ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ఇండియా లాంజ్‌ను ప్రారంభించారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఈ సందర్భంగా ఆయన కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 'నేషన్ ఫస్ట్' అనే భావనతో అన్ని రాష్ట్రాలు, కేంద్రం కలిసి టీమ్ ఇండియాగా పని చేయాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రాల మధ్య పోటీ ఉన్నా, దేశంగా మాత్రం అందరం ఒక్కటేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత్ వేగంగా బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతోందని, ప్రపంచంలోనే పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన గమ్యస్థానంగా భారత్ నిలిచిందని చంద్రబాబు తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు భారత్ వైపే చూస్తున్నాయన్నారు. మన దేశానికి బలమైన నాయకత్వం ఉందని, దేశ శక్తి సామర్థ్యాలను ఇప్పటికే ప్రపంచానికి చాటిచెప్పామని చెప్పారు. అదే సమయంలో పటిష్టమైన వ్యవస్థల రూపకల్పన కూడా జరుగుతోందని పేర్కొన్నారు. దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చినా, అందరం భారత్‌కే ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలుగా పోటీ పడుతున్నప్పటికీ, దేశంగా మాత్రం పరస్పర సహకారం అందించుకుంటూ ముందుకు సాగుతున్నామని సీఎం వివరించారు. సంపద సృష్టితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# కొందుర్గు లో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు

**జర్నలిస్ట్ డైరీ,షాద్ నగర్:**
గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల పోటీలు కేవలం ఆటలకే పరిమితం కాకుండా, గ్రామాల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ స్నేహబంధాలను మరింత దృఢంగా చేస్తాయని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన కొందుర్గు ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేత జట్లకు ట్రోఫీలు, బహుమతులను అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, దాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడా టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామాల్లోని యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిని దాటి అంతర్జాతీయ వేదికలపై కూడా భారతదేశానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.
క్రీడలు – ఆరోగ్యం, క్రమశిక్షణకు పునాది
క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని అంజయ్య యాదవ్ తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, నాయకత్వ లక్షణాలు క్రీడల ద్వారానే అలవడతాయని అన్నారు. గ్రామీణ యువత క్రీడల వైపు మొగ్గు చూపడం వల్ల మత్తుపదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని స్పష్టం చేశారు.
ఇటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల పోటీలు తరచుగా జరుగుతుండడం ఆనందకరమని, ఇది గ్రామీణ సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడుతుందని అన్నారు. క్రీడలు గ్రామస్తుల మధ్య స్నేహభావాన్ని పెంచడంతో పాటు, సామాజిక బాధ్యతను కూడా పెంపొందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.
గ్రామీణ క్రీడలకు అండగా నిలిచిన నాయకత్వం
కేపీఎల్ టోర్నమెంట్ నిర్వహణకు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆర్థిక సహాయం అందించడం పట్ల స్థానిక క్రీడాకారులు, యువత, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో అంజయ్య యాదవ్ ఎప్పుడూ ముందుంటారని, ఆయన సహకారం వల్లే ఈ స్థాయిలో టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించగలిగామని నిర్వాహకులు తెలిపారు.
ఇలాంటి నాయకుల ప్రోత్సాహం గ్రామీణ క్రీడలకు నూతన ఊపిరి పోస్తుందని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని వారు అన్నారు. ఉత్సాహంగా ముగిసిన కేపీఎల్ టోర్నమెంట్ కొన్ని రోజుల పాటు కొనసాగిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మండల పరిధిలోని వివిధ గ్రామాల జట్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తూ చివరి ఓవర్ వరకూ ఉత్కంఠ భరితంగా సాగింది. విజేత జట్లను గ్రామస్తులు చప్పట్లతో అభినందించారు. ప్రముఖుల విస్తృత హాజరు






ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, స్థానిక సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ మాణయ్య, మాజీ సర్పంచ్ రామకృష్ణ, సర్పంచులు రాములు, శేఖర్ పాల్గొన్నారు. అలాగే నాయకులు చందు, యాదగిరి, శుకూర్, వెంకటయ్య, రాజనరసింహా రెడ్డి, సున్నాల శ్రీను, రమేష్, సంజీవ, వాసురి, పద్మారావు, ప్రశాంత్, చెన్నయ్య, సాయి, సచిన్ తదితరులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉగాది నుంచి 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్ట్.. యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి.. డిప్యూటీ సీఎం ఆదేశాలు..

- **ఉగాది నుంచి 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్టు అమలు..**
- **ఉగాదిలోపు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి..**
- **గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలూ త్రికరణ శుద్ధిగా భాగస్వాములు కావాలి..**
- **గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి మొక్కలకు ప్రాధాన్యం..**
- **ఆయా శాఖల భాగస్వామ్యంపై పవన్ కల్యాణ్ దిశానిర్దేశం..**



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**
రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు ఉగాదిలోపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు కావాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ.. కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకానికి సిద్ధం కావాలని నిర్దేశం చేశారు. గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్ష జాతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత వర్గాలకు సూచనలు చేశారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్టుపై చర్చించారు. ప్రాజెక్టు ప్రణాళికలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు.
ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపు ప్రాజెక్టుకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.. రాష్ట్రం మొత్తం భూభాగంలో 2047 నాటికి 50 శాతం పచ్చదనంతో నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఈ లక్ష్యంలో భాగంగా 2030 నాటికి 37 శాతం పచ్చదనం నింపాల్సి ఉందన్నారు.. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం గ్రీనరి ఉండగా.., వచ్చే నాలుగేళ్లలో మరో 7 శాతం గ్రీనరీ పెంచాల్సి ఉంది. అందుకోసం 9 లక్షల హెక్టార్లలో చెట్లను నాటాలని పిలుపునిచ్చారు.. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమ వంతు భాగస్వామ్యం పోషించాల్సి ఉంది. అందులో ఉద్యానవన శాఖ 12 శాతం మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాల్సి ఉంది.. ప్రతి మొక్కా పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడాలి.. వీటితోపాటు అటవీ, పర్యావరణ శాఖలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలు, నీటిపారుదల శాఖ, పాఠశాల విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, పరిశ్రమల శాఖ, వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న రైల్వే తదితర శాఖలు తమ తమ పరిధిలో లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..
జాతీయ రహదారులకి ఇరువైపులా మొక్కలు నాటే సంప్రదాయం ఉంది.. దీన్ని రాష్ట్ర పరిధిలోని రహదారుల నిర్మాణంలోనూ అమలు చేయాలి అన్నారు పవన్.. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టు కూడా గ్రీన్ కవర్ పెంపునకు దోహదపడుతుంది.. 970 ఎకరాల తీర ప్రాంతం వెంబడి 40 శాతం అటవీ శాఖ పరిధిలో ఉండగా, మిగిలిన భూభాగంలో ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరం అయిన ప్రణాళికలు ఆయా శాఖలు సిద్ధం చేయాలి. తీర ప్రాంతం వెంబడి ఉన్న ప్రాంతంలో అక్కడ వాతావరణ పరిస్థితులకు తట్టుకునే మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పారిశ్రామిక కారిడార్లలో కాలుష్య నియంత్రణకు తోడ్పడే మొక్కలను పెంచాలి. రైతుల భూముల్లో వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే పండ్ల రకాల మొక్కలు పెంచాలి. కాలువగట్లు, చెరువుల గట్ల వెంబడి కూడా పండ్ల మొక్కలు నాటాలి. మనం నాటే ప్రతి మొక్క పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడే స్వజాతి మొక్కలు ఉండేలా చూసుకోవాలి. అందుకు సంబంధించి శాఖల వారీ యాక్షన్ ప్లాన్ అవసరం అన్నారు.. నిర్దేశిత సమయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేయండి. బడ్జెట్ కేటాయింపులు ముఖ్యమంత్రి తో చర్చిస్తాం.. లక్ష్యాలకు అనుగుణంగా కార్యచరణ సిద్ధం చేసే బాధ్యతను యంత్రాంగం నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్లాలి.. అన్ని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఫిబ్రవరి 5వ తేదీన జరిగే తదుపరి సమావేశానికి పూర్తి స్థాయి ప్రణాళికలతో రావాలని అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

## మాజీ మంత్రి జోగి రమేష్‌కు బెయిల్.. అయినా జైలులోనే..!

- **ఏపీ నకిలీ మద్యం తయారీ కేసులో కీలక మలుపు..**
- **మాజీ మంత్రి జోగి రమేష్ కు స్వల్ప ఊరట..**
- **ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ కేసులో జోగి బ్రదర్స్ కు బెయిల్..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**
ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ స్కామ్ కేసుతో పాటు నకిలీ మద్యం తయారీ కేసు సంచలనం సృష్టించింది.. ఈ కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ కు స్వల్ప ఊరట లభించింది.. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీకి సంబంధించిన కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ తో పాటు ఆయన సోదరుడు జోగి రాముపై నమోదైన కేసులో ఎక్సైజ్ కోర్టు ఇవాళ ఇద్దరికీ బెయిల్ మంజూరు చేసింది.. ఈ కేసులో అరెస్టైన జోగి రమేష్, జోగి రాము బ్రదర్స్..79 రోజులుగా విజయవాడ జైల్లో రిమాండ్‌లో ఉన్నారు.. ఇవాళ బెయిల్ మంజూరు కావడంతో.. వారికి ఊరట లభించినట్టు అయ్యింది.. అయితే, ములకలచెరువు దగ్గర నకిలీ మద్యం తయారీ కేసులో కూడా జోగి రమేష్ నిందితుడిగా ఉండటంతో ఆయనకు ఇబ్రహీంపట్నంలో బెయిల్ లభించినా..జైలు నుంచి విడుదల అయ్యే అవకాశాలు లేవు.. ఆ కేసులో కూడా బెయిల్ వస్తే జోగి రమేష్ జైలు నుంచి విడుదలవుతారని తెలుస్తోంది..


# మంథని మున్సిపాలిటీ పై గులాబీ జెండా ఎగరాలి

**జర్నలిస్ట్ డైరీ, మంథని:**
రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మంథని మున్సిపాలిటీపై గులాబీజెండా ఎగురాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం మంథని పట్టణంలోని రాజగృహాలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆశావాహులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ముందస్తు సన్నాహాక సమావేశం నిర్వహించి దిశా నిర్ధేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో మన అభ్యర్థుల గెలుపు కోసం కలికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమిష్టిగా పని చేస్తేనే విజయం సాధించగలమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఏ ఎన్నికలు జరిగినా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని, ఎవరి గెలుపు కోసమైనా ఒకే రకంగా పనిచేస్తామని అన్నారు. తనతో పాటు అందరూ సమానంగా పైకి రావాలని ఆకాంక్షిస్తానని, తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చామని, పలు ఎన్నికల్లో అభ్యర్థులకు గెలిపించుకుని వారి ఉన్నత పదవులు వచ్చేలా కృషి చేశామన్నారు. తనతో పాటు అందరూ అభివృద్ధి చెందా లనే ఆలోచనతో ముందుకు వెళ్తానన్నారు. అయితే ఈసారి జరిగే మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం విశ్వాసం చూపిస్తున్నారని, ఓట్ల కోసం వెళ్తే గౌరవించే అవకాశం ఉందన్నారు. రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, మంథని ఎమ్మెల్యే ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా ఉండి రెండేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా యువత భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేసిన దాఖలాలు లేవన్నారు. మున్సిపాలిటి పరిధిలో ఒక్కరికి ఉద్యోగం ఇప్పించిన దాఖలాలు లేకపోగా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఓ ఇండస్ట్రీ కూడా తీసుకురాలేదన్నారు. అలాగే తాము పోతారం లిఫ్ట్ కోసం ప్రతిపాదన చేశామని, తద్వారా మున్సిపల్ పరిధిలోని బన్నెచెరువు, శీలసముద్రంతో పాటు కన్నాల ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు వచ్చి రైతులకు ఉపయోగపడుతుందని మొదలుపెడితే ఇప్పటి వరకు మంథని ఎమ్మెల్యే దాని గురించి ఆలోచన చేయలేదన్నారు. ఆనాడు ఎమ్మెల్యేగా మంథని మున్సిపాలిటీకి మానీఫెస్టో తీసుకువచ్చాడని, కానీ ఇప్పటి వరకు ఆ మానీఫెస్టో అమలు చేయలేదన్నారు. ఓట్లు వస్తేనే ఏ విధంగా వాడుకుంటారోననే విషయాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు కేవలం మంత్రి ఉన్నాడని, అధికారంలో ఉన్నామనే ధీమా తప్ప ప్రజలు విశ్వసించే పరిస్థితులు లేవన్నారు. మంథని రక్షించబడాలంటే ప్రజలు బాగుండాలంటే ప్రశాంతమైన వాతావరణం ఉండాలంటే మున్సిపల్ బీఆర్ఎస్ చేతుల్లో ఉండాలని ప్రజల్లో చర్చ జరుగుతోందని, ఆ దిశగానే ముందుకు సాగి విజయం సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.






# దానిమ్మతో దరిచేరవు ఈ సమస్యలు!





దానిమ్మ పండు.. రక్తం పట్టాలన్నా, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నా వీటిని తినాలని సిఫార్సు చేస్తారు. అయితే చాలా మంది దానిమ్మ పండ్లు తినడం వల్ల రక్తం బాగా పడుతుందని మాత్రమే అనుకుంటారు. కానీ వీటిని తినడం వల్ల మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. ప్రతి రోజూ ఒక దానిమ్మ పండు తింటే అది మనల్ని ఎంతో ఆరోగ్యవంతంగా మారుస్తుందని, ఎన్నో ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియా నుంచి కాపాడుతుందని వైద్య నిపునులు చెప్తున్నారు. సాధారణంగా ఏ పండుకైనా ఒక సీజన్ అన్నది ఉంటుంది. అలా లేని పండ్లు చాలా తక్కువ. వాటిలో దానిమ్మ కూడా ఒకటి. దీనిని ఏ సీజన్‌లో తిన్నా అద్భుత ప్రయోజనాలు అందిస్తుందని వైద్యులు అంటున్నారు. దానిమ్మ పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన రికవరీని పెంచుతాయి. దాంతో పాటుగా ఇందులో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మంచి కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవన్నీ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు వారానికి మూడు దానిమ్మ పండ్లైనా తినాలని వైద్యులు అంటున్నారు. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని చెప్తున్నారు ఆరోగ్య నిపుణులు. మరి అవేంటో తెలుసా..

## అజీర్తికి స్వస్తి



దానిమ్మ పండ్లలో ఫైబర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకం, అజీర్తి సమస్యలను అధిగమించడానికి సహాయపడుతుంది. దానిమ్మ పండ్లలో ఉండే అధిక ఫైబర్ ఎక్కువ సేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దానివల్ల బరువు తగ్గడానికి కూడా ఇవి బాగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా రోజూ ఉదయాన్ని దానిమ్మ పండు తింటే.. ఇది ఇన్‌స్టంట్ ఎనర్జీని అందించి రోజంతా ఎనర్జిటిక్‌గా ఉండేలా చేస్తుంది. దీంతో పాటుగా దానిమ్మ వల్ల బీపీ కూడా కంట్రోల్ అవుతుంది.

## గుండె పదిలం

దానిమ్మ పండు మన గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే పాలీఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ వంటి యాంటీ ఆక్సిడంట్ల వల్ల శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్, ఆక్సిడేటివ్ స్ట్రేస్‌ను తగ్గిస్తుంది. అంతేకాకుండా శరీరంలోని కొవ్వును కూడా నియంత్రణలో ఉంచుతుంది. తద్వారా గుండెపై అధికబారం పడకుండా కాపాడుతుంది. గుండె బలంగా పదిలంగా ఉండటానికి దోహదపడుతుంది. దానిమ్మను తరచుగా తినడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అనేక రకాల గుండె సంబంధిత సమస్యలు రాకుండా కూడా దానిమ్మ పండు కాపాడుతుంది.




**రోగనిరోధక శక్తి:** దానిమ్మ పండులో విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. శరీరంలోని తెల్లరక్తకణాల సంఖ్యను పెంచడంలో కూడా దానిమ్మ పండ్లు బాగా పనిచేస్తాయి. ఇందులో ఉండే అనేక పోషకాలు మన రోగనిరోధక శక్తిని అధికం చేస్తుంది. తద్వారా అనేక రకాల బ్యాక్టీరియాలు, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని కాపాడుతుంది.

**మెరిసే చర్మ:** దానిమ్మ పండ్లలో భారీ మొత్తంలో పోషకాలు ఉంటాయి. ఇవి మన ఎనర్జీని పెంచడంతో పాటు మన చర్మానికి కావాల్సిన పోషకాలను అందించడంలో కూడా దానిమ్మ పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. చర్మం సాగే గుణాన్ని పునరుద్ధరించడమే కాకుండా చర్మ సౌందర్యాన్ని అధికం చేస్తుంది. కాలం ఏదైనా దానికి అనుగుణంగా చర్మం ఉంటుంది. ప్రతి రోజూ దానిమ్మ పండు తినడం ద్వారా మెరిసే చర్మాన్ని పొందొచ్చని నిపుణులు చెప్తున్నారు.

**మెదడు ఆరోగ్యం:** దానిమ్మ పండ్లు మన మెదడు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కణాల పునరుత్పత్తిని వేగవంతం చేస్తుంది. అంతేకాకుండా తరచుగా జరిగే కణాల డ్యామేజీని కూడా గణనీయంగా తగ్గిస్తుంది. దానిమ్మ పండ్లలో ఉండే ఫాలీఫినాల్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మన మెదడు ఆరోగ్యాన్ని అధికం చేస్తుంది. అల్జీమర్స్ వంటి వ్యాదులను తగ్గించే గుణాలు కూడా దానిమ్మ పండ్లలో అధకంగా ఉంటాయని నిపుణులు చెప్తున్నారు.

# విటమిన్-డీ లోపాన్ని ఎలా గుర్తించాలో తెలుసా?




మనిషికి ప్రతి విటమిన్ చాలా ముఖ్యం. ఏ ఒక్క విటమిన్ లోపించినా ఆరోగ్య సమస్యలు వస్తాయి. వీటిలో చాలా వరకు విటమిన్లు మనకు ఆహారం ద్వారా లభిస్తాయి. కొన్ని మాత్రం ప్రకృతి ద్వారా మాత్రమే వస్తాయి. ఆహారం ద్వారా అవి లభించినప్పటికీ.. అవి మనకు సరిపడా అందవు. అలాంటి వాటిలో ప్రథమంగా కనిపించేది విటమిన్-డి. ఇది సూర్యకాంతి నుంచి లభిస్తుంది. రోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల సమయంలో ఎండలో నిల్చోవడం ద్వారా విటమిన్-డీని పొందవచ్చు. కానీ ఇప్పుడు బిజీ లైఫ్‌తో ఎండలో నిల్చునే సమయం కూడా ఎవరికీ ఉండటం లేదు. దీంతో చాలా మందికి విటమిన్ డీ లోపం ఏర్పడుతుందేని నిపుణులు చెప్తున్నారు. దీనిని గుర్తించడానికి పలు రకాల టెస్ట్‌లు ఉన్నాయి. కానీ అవన్నీ కూడా ఖరీదుతో కూడుకున్నవి. అయితే విటమిన్ డీ లోపాన్ని మనం ఇంట్లోనే ఉండి కూడా గుర్తించవచ్చని నిపుణులు చెప్తున్నారు. మరి విటమిన్-డీ లోపిస్తే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో తెలుసుకుందామా..

**జుట్టు రాలడం:** శరీరంలో విటమిన్-డీ లోపిస్తే జుట్టు అధికంగా రాలుతుంది. చాలా మంది జుట్టు రాలుతుంటే జన్యుపరైన సమస్య అనుకుంటారు. పైగా జుట్టు రాలుతున్న సమస్యను లైట్‌తీసుకుంటారు. కానీ విటమిన్-డీ లోపం వల్ల కూడా జుట్టు రాలడం జరుగుతుంది. ఈ విటమిన్ లోపం తలపై ఫోలికల్స్ ఏర్పడటానికి దారితీస్తుందని, దాని ఫలితంగా జుట్టు సమస్యలు కూడా అనేకం వస్తాయని నిపుణులు చెప్తున్నారు.

**ఆందోళన:** ఈ విటమిన్ లోపం వల్ల మనలో ఆందోళన, ఒత్తిడి కూడా అధికం అవుతాయి. ఏసీలో కూర్చుని ఉన్నా చెమటలు పట్టేస్తాయి. ఈ విటమిన్ సెరోటోనిన్ హార్మోన్ ఉత్పత్తికి, మెదడుకు సరైన పనితీరుకు చాలా అవసరం. ఈ హార్మోన్ మానసిక స్థితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. తగినంత విటమిన్ డి తీసుకోకపోవడం వల్ల మానసిక స్థితిలో మార్పులు, ఆందోళన మరియు నిరాశ కలుగుతాయి.

విటమిన్-డీ లోపం వల్ల కండరాల నొప్పులు కూడా వస్తాయి. కొద్దిసేపు నడిచినా అలసిపోతున్న భావన కలుగుతుంది. అమితమైన ఆయాసం వస్తుంది. కొన్ని సార్లు అధిక శ్రమ వల్ల కూడా ఇలానే అనిపిస్తుంది. కానీ విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా అలసటగానే ఉంటుందంటే మాత్రం విటమిన్-డీ లోపంగానే భావించాలని నిపుణులు చెప్తున్నారు. అంతేకాకుండా విటమిన్-డీ లోపిస్తే కడుపు ఉబ్బరం, విరేచనాలు, మలబద్ధకం వంటి సమస్యలు కూడా వస్తాయని చెప్తున్నారు.

ఈ సమస్య నుంచి బయట పడాలంటే రోజూ ఒక అరగంట పాటు ఎండలో ఉండాలి. అదే విధంగా మన ఆహారంలో విటమిన్-డీ ఉన్న ఆహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని నిపుణులు చెప్తున్నారు.

# పిల్లల ముందు తల్లిదండ్రులు ఈ పనులు అస్సలు చేయకూడదు!

పిల్లలకు తొలి గురువులు తల్లిదండ్రులే. వారిని చూసే పిల్లలు అన్నీ నేర్చుకుంటారు. తొలి పలుగులు, తొలి అడుగులు ఇలా అన్నీ కూడా తల్లిదండ్రుల నుంచే నేర్చుకుంటారు. పిల్లల వ్యక్తిత్వ నిర్మాణంలో తల్లిదండ్రులు ప్రధాన, కీలక పాత్ర పోషిస్తారు. పేరెంట్స్ చేసే చిన్నచిన్న తప్పిదాలు కూడా పిల్లల మనస్తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని పూర్తిగా మర్చేసే అవకాశం ఉంటుంది. ఆరేళ్ల వయసులో ఉన్న పిల్లలు మాట్లాడటం, అర్థం చేసుకోవడం అన్నీ ఇంట్లోని వారిని చూసి నేర్చుకుంటూ ఉంటారు. తమ చుట్టూ ఉన్న వాతావరణాన్ని చూడటం ద్వారా చాలా విషయాలను తెలుసుకుంటారు. చుట్టుపక్కల వాతావరణం వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అటువంటి పరిస్థితిలో, తల్లిదండ్రులు వారి పెంపకం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. అందుకే చిన్న పిల్లలు చుట్టుపక్కల ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఆచితూచి ప్రవర్తించాలి. లేకుంటే వారి ప్రవర్తన పిల్లల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. మరీ ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న తల్లిదండ్రులు పిల్లల ముందు ముఖ్యంగా ఐదు పనులు చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో తెలుసా.

**గొడవలు**

ఇంట్లో భార్యాభర్తలు ఒకరితో ఒకరు గొడవ పడటం సహజం. కానీ మీరు తల్లిదండ్రులు అయినప్పుడు, మీరు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. తల్లిదండ్రులుగా మారాక వాదనలు, గొడవలు పడేటప్పులు జాగ్రత్తగా వ్యవహరించాలి. బిగ్గరగా అరవడం, ఒకరినొకరు దూషించడం వంటివి మీ పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. మీ పిల్లలు మిమ్మల్ని చూడటం ద్వారా ప్రతిదీ నేర్చుకుంటారు. కాబట్టి వారి ముందు మీరు రఫ్ గా ప్రవర్తించకండి.

**ఆర్థిక ఇబ్బందులు**

ఆరేళ్ల వయసు ఉన్న పిల్లల ముందు ఆర్థిక ఇబ్బందులు గురించి, మీకు వచ్చే ఆదాయం గురించి మాట్లాడకండి. చాలాసార్లు తల్లిదండ్రులు తమ బిడ్డ ఇంకా చిన్నవాడని, అతను ఈ విషయాలను ఇంకా అర్థం చేసుకోలేదని భావిస్తారు. పిల్లల చిన్న మెదడు మొత్తం విషయం అర్థం కాకపోయినా, అతని తల్లిదండ్రులు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి డబ్బు కొరత ఉందని అర్థం చేసుకుంటుంది. ఈ కారణంగా వారు కూడా దాని గురించి ఆలోచించి ఎక్కడో ఒకచోట ఒత్తిడికి గురవుతారు.

**దెయ్యాలు గురించి**

ప్రతిరోజూ మీరు వార్తాపత్రిక లేదా టీవీలో హృదయ విదారకమైన సంఘటనను వింటారు. ఇలాంటి షాకింగ్ సంఘటనలు ఇంట్లో ప్రస్తావించడం సహజమే. కానీ మీ ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే ఇలాంటి విషయాల గురించి మాట్లాడకుండా ఉండాలి. అలాగే,సరదా కోసం కూడా దెయ్యాలు గురించి చెప్పకండి. బూచి పేరు చెప్పి పిల్లలను భయపెట్టడం మానేయండి. ఇవన్నీ పిల్లల మనస్సులో భయాన్ని సృష్టిస్తాయి, ఇది అతని మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది.

**నెగిటివ్ మాటలొద్దు..**

చాలాసార్లు, తల్లిదండ్రులు పిల్లల పాఠశాల, ఉపాధ్యాయుడి గురించి సరదాగా మాట్లాడతారు. టీచర్ల గురించి, చదువుల గురించి చెడుగా మాట్లాడకండి. ఇలాంటివి పదేపదే వింటే పిల్లల మనస్సులో ప్రతికూల భావన పడుతుంది. మీరు చదువు పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తే, పిల్లవాడు కూడా అదే కాపీ కొడతాడు. అటువంటి పరిస్థితిలో, పిల్లల చదువు, ఉపాధ్యాయుడికి పూర్తి గౌరవం ఇవ్వండి.

పిల్లలు తమ తల్లిదండ్రులను చూడటం ద్వారానే సగానికి పైగా విషయాలను నేర్చుకుంటారు. మీరు ఇతరుల పట్ల ఎలా ప్రవర్తిస్తారో పిల్లలు కూడా చాలా దగ్గరగా గమనిస్తారు. మీరు ఎల్లప్పుడూ వ్యక్తుల గురించి చెడుగా, ప్రతికూలంగా మాట్లాడుతుంటే, మీ పిల్లలు కూడా ఈ ప్రవర్తనను కాపీ కొట్టడం ప్రారంభిస్తారు. అటువంటి పరిస్థితిలో, మీరు ఎవరి గురించినైనా తప్పుగా మాట్లాడాలనుకుంటే, కనీసం పిల్లల ముందు మాట్లాడవద్దు అని నిపుణులు సూచిస్తున్నారు.





## ఆలోచింప చేసే అద్భుత సినిమా దండోరా

# సినిమాను చూసి మెచ్చుకున్న ఎన్టీఆర్

తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇది ఎంతో లోతైన, శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే చిత్రం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవిలు తమ నటనతో సినిమా ఆద్యంతం అద్భుతంగా రాణించారు. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఇలాంటి గొప్ప ప్రయత్నాన్ని ప్రోత్సహించి, నిర్మించిన రవీంద్ర బెనర్జీ గారికి అభినందనలు. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకోచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్`2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.

# బాబీ దర్శకత్వంలో చిరు తదుపరి సినిమా



ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్ర సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురి సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

# శర్వానంద్‌కు కలసి వచ్చిన బాలయ్య సెంటిమెంట్




టాలీవుడ్‌లో కొన్ని చిత్రాలకు సంబంధించిన విశేషాలు భలే ఆసక్తికరంగా మారుతుంటాయి. అలాంటి సంఘటన ఒకటి హీరో శర్వానంద్ నటించిన నారి నారి నడుమ మురారి సినిమాకు జరిగింది. శర్వా హీరోగా రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో అనిల్ సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి సూపర్ హిట్ గా నిలిచింది. ఫెస్టివల్ సీజన్‌లో వచ్చిన చిత్రాల్లో చిన్న సినిమాగా వచ్చి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద బి□`గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా మారింది.ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 36 ఏళ్ల క్రితం నందమూరి బాలకృష్ణ హీరోగా, ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో 'నారి నారి నడుమ మురారి' అనే సినిమా విడుదలై అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. అందుకే అదే టైటిల్‌ను శర్వానంద్ సినిమా కోసం ఫిక్స్ చేయగానే, అది బాలకృష్ణ సినిమా టైటిల్ కదా అని ఆయన అనుమతి తీసుకోవాలని శర్వానంద్ స్వయంగా బాలకృష్ణకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఈ విషయం నాకెందుకు చెప్తున్నావు, నిరభ్యంతరంగా టైటిల్ పెట్టుకో అంటూ బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు, టైటిల్ పెట్టుకోమని చెప్పడమే కాకుండా సినిమా షూటింగ్‌కు, టైటిల్ రివీల్ కు ముహూర్తం కూడా బాలకృష్ణ ఫిక్స్ చేశారట. ఇక భారీ సినిమాల మధ్య పోటీగా రిలీజ్ అయినా నారి నారి నడుమ మురారి శర్వా కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచి ఇటు నిర్మాతలకు అటు డిస్ట్రిబ్యూటర్స్ కు భారీ లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ విషయాన్నీ బాలయ్యకు చెప్పేందుకు శర్వానంద్ మరోసారి కాల్ చేయగా 'నా పేరు కాపాడావు? సినిమా సూపర్ హిట్ అయిందని తెలిసింది. ఇలానే రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు చేయాలి' అంటూ శర్వానంద్‌ను దీవించారట బాలయ్య. ఆ సంతోషాన్ని తన ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటూ ఇక నుంచి నా సినిమాలన్నింటికీ బాలయ్యతోనే ముహూర్తం పెట్టించుకుంటాను అని అన్నారట. మొత్తానికి, బాలయ్య టైటిల్ తో ఆయన పెట్టిన ముహూర్తంతో శర్వానంద్‌కు భారీ హిట్ అందుకున్నాడు.

# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు



తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ□`లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# దృశ్యం-3 కోసం వెంకటేశ్ బిజీ



కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465